క్లుప్తంగా

నేడు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19(గురువారం)న మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి నాల్గవ తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లలో నాల్గో తరగతిలో ప్రవేశం కోసం 19న ఘన్‌పూర్‌లో జరిగే మండల స్థాయిలో ఎంపికైన వారికి ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగే జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ పీఈటీ చంద్రశేఖర్‌రెడ్డిని 7799552233 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

చర్య తీసుకోవాలి



ధ్వంసం చేసిన కనీల వద్ద బాధితురాలు

చిల్పూరు: తన పట్టా భూమిలోని కనీలను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని బాధితురాలు మంద స్వరూప బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2015లో రాజవరం గ్రామ సమీపంలోని 63/ఏలో 6 ఎకరాల 32 గుంటల వ్యవసాయ భూమిని ఇదే గ్రామానికి చెందిన మారేపల్లి విష్ణువర్ధన్ వద్ద కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఆ సమయంలో కౌలుకు చేస్తున్న గ్రామానికి చెందిన గుండెల్లి కనుకయ్య తాము రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో 2017లో నకిలీ పత్రాలతో ధరణిలో కౌలుదారుగా పేరు నమోదు చేసుకున్నాడని, విషయం తెలుసుకున్న తాను కోర్టుకు వెళ్లగా న్యాయ స్థానం తనకే చెందేలా చెప్పడంతో పాటు (అప్పటి రైతు బంధు) నేటి రైతు భరోసా తనకే వచ్చేలా తీర్పు ఇచ్చిందన్నారు. అయినా వ్యవసాయ భూమిని వదలకుండా తనను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను ఆశ్రయించడం జరిగిందన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

జఫర్‌గఢ్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్థానిక ఎస్సై రామ్‌చరణ్ హెచ్చరించారు. కూనూర్, తిడుగు, గర్మిళ్లపల్లి గ్రామాల మీదుగా ఉన్న అకేరు వాగు నుంచి ఇసుక తరలింపును అడ్డుకునేందుకు ఎస్సై రామ్‌చరణ్ స్వయంగా పొక్లెయినర్ యంత్రం ద్వారా రవాణాకు అనుకూలంగా ఉన్న దారిలో పెద్ద గుంతలు తీయించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గుంతలు ఎవ రూ పూడ్చ వద్దన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జానకీరాంరెడ్డి

పాలకుర్తిటౌన్: పాలకుర్తి సర్కిల్ నూతన సీఐగా నియమితులైన వంగాలి జానకీ రాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ సీఐగా పని చేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పాలకుర్తి సీఐగా వచ్చారు. ఇప్పటివరకు సీఐగా పని చేసిన మహేందర్‌రెడ్డి మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లారు. నూతన సీఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంధకారంలో జాతీయ రహదారి

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ఎమ్మెల్యే ఆదేశించినా స్పందించని అధికారులు



లైట్లు వెలగకపోవడంతో అంధకారంలో ఉన్న జాతీయ రహదారి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో స్థానిక బస్టాండ్ నుంచి విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల వరకు జాతీయ రహదారిపై గత వారం రోజులుగా లైట్లు వెలగడం లేదు. దాంతో రాత్రి అయిందంటే జాతీయ రహదారి అంధకారంలో దర్శనమిస్తుంది. రహదారిపై లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో రహదారిపై పలు రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయనున్న స్థలాన్ని పరిశీలించేందుకు మూడు రోజుల క్రితం ఎన్‌హెచ్ అధికారులతో కలిసి ఎంపీడాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన్‌పూర్‌కు వచ్చిన సందర్భంగా స్థానికులు హైవేపై వెలగని వీధిదీపాల సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. లైట్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎన్‌హెచ్ అధికారులను ఎమ్మెల్యే కడియం ఆదేశించినా ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్వయంగా ఎమ్మెల్యే ఆదేశించినా స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నర్మెట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఎన్నికల హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు అన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం నర్మెట చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు బరోసా, రెండు లక్షల రుణమాఫీని తుంగలోతొక్కి రైతన్నలను నిండా ముంచారని ఆరోపించారు. కాంగ్రెస్ కమిటీ సిఫారసు పత్రాలున్నవారికే ఇళ్లు ఇవ్వడం సరికాదని అన్నారు. దివ్యాంగులు, వంతంతువులు, నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ బోడపాటి అరవింద్ చౌదరికి వినతి పత్రం అందజేశారు. మండల, జిల్లా నాయకులు రాజబోయిన శ్రీనివాస్, చెవుల రాజు, ధరావత్ వినోద్, కొన్నె రాజు పాల్గొన్నారు.

‘భూభారతి’తో సమస్యల పరిష్కారం



దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీఓ గోపీరామ్

బచ్చన్నపేట: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు జనగామ ఆర్డీఓ గోపీరామ్ నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించి రైతుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ ఫణికిషోర్, డీటీ స్రవంతి, ఎంఆర్ఐ కృష్ణవంశీ, ఏఆర్ఐ మున్వర్, జూనియర్ అసిస్టెంట్ యాకయ్య, సర్వేయర్ నర్మద, రజిత, గంగా స్వప్న పాల్గొన్నారు.

దేవరుప్పుల: భూభారతి చట్టం లోబడి భూసమస్యలను పరిష్కరించేందుకు శాఖపరంగా కృషి చేస్తామని తహసీల్దార్ ఆడెపు ఆండాళ్ అన్నారు. మండలంలోని పెద్దమడూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో 77 దరఖాస్తులు స్వీకరించారు. నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

ఘనంగా పండుతాళ్ల కల్లు పండుగ



పండుతాళ్ల కల్లు పండుగలో గౌడ కులస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలో పండుతాళ్ల కల్లు పండుగను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మందపురం శివాజీగౌడ్ ఆధ్వర్యంలో పండుతాళ్ల కల్లు పండుగను ఆనవాయితీ ప్రకారం ఘనంగా నిర్వహించి గ్రామంలోని ప్రముఖులను పిలిచి వేడుకగా చేపట్టారు. గ్రామంలోని కంఠమహేశ్వరస్వామి గుడి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా తాటివనం ఎల్లమ్మ తల్లికి, కంఠమహేశ్వరునికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆసాములకు కల్లు వంచి గౌడకులస్తులు ఆనందాన్ని పంచుకున్నారు. మందపురం మహేష్, మహేందర్, మందపురం ఎల్లగౌడ్, పల్లె రవీందర్‌గౌడ్, చట్ల రాజుగౌడ్, కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడితే జీవితం వినాశనం

దేవరుప్పుల: యువత తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్ జీవితం వినాశనమవుతుందని పాలకుర్తి సీఐ వి.జానకీ రాంరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ధర్మగడ్డతండాకు చెందిన భూక్య నరేష్, చౌడబోయిన సురేష్‌లు గంజాయి వినియోగించగా అదుపులోకి తీసుకుని అరెస్టు చూపించారు. హైదరాబాద్‌లో జోమోటా బాయ్‌గా పనిచేస్తున్న నరేష్ దూలీపేట ప్రాంత వాసులతో గంజాయి తెచ్చే కాంటాక్ట్ పెట్టుకుని స్వగ్రామానికి వచ్చే క్రమంలో సురేష్‌కు అలవాటు చేశారు. ఈ క్రమంలో తండాలో ఎస్సై ఊర సృజన్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా అనుహ్యంగా ఆ ఇద్దరు చిక్కినట్టు వివరించారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

చిన్నమడూరులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీపీ వి.జానకీ రాంరెడ్డి పేర్కొన్నారు. చినమడూరు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. చిన్నమడూరు గ్రామ శివారు స్మశాన వాటిక వెనుకాల పేకాటు ఆడుతున్న సమాచారం మేరకు ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేపట్టగా వెలుగు చూసిందన్నారు. పేకాట ఆడిన వారిలో మడికొండ రవి, మేడ అబ్బ సాయిలు, ముసిగింపుల వెంకన్న ,రంపె శివ, అంగిడి సతీష్, మడికొండ నరసయ్య, మేడ ఎల్లయ్య ఉన్నారన్నారు. వీరి వద్ద రూ. 5వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్టు వివరించారు. కాగా సమాజ వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేస్తున్న మండల పోలీసు యంత్రాంగానికి డీసీపీ రాజమహేందర్ నాయక్, ఏసీపీ అంబటి నర్సయ్య అభినందనలు తెలిపినట్టు పేర్కొన్నారు.

‘రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి’

కొడకండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తూ రైతు బాంధవుడిగా సీఎం రేవంత్‌రెడ్డి ఖ్యాతి గడిస్తున్నాడని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మసురం రవీందర్ అన్నారు. రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్లలోకి విడుదల చేయడాన్ని హర్షిస్తూ బుధవారం మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిల చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ రామచంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్లు నాగరాజు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను వారి అకౌంట్లలో జమ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ యశ్వంతాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, కట్ట కృష్ణ, జయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రైతు భరోసా అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమే

చిల్పూరు: అర్హులకు రైతు భరోసా అందించింది కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కండ్లకోలు బాలరాజు అన్నారు. లింగంపల్లి గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చాక పంటల సాగుకోసం ముందే రైతు భరోసా అందించడం జరిగిందన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తరింపజేయాలి



ప్రమాణస్వీకారంలో నూతన కార్యవర్గం

దేవరుప్పుల: సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరింపజేయాలని లయన్స్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రెడ్డి సామూహిక భవన్‌లో లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా గోలి చిన్న ఉప్పల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బూత్కూరి అశోక్‌రెడ్డి, కోశాధికారిగా ఈదునూరి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారోత్సవం చేయించగా ఆయన మాట్లాడారు. గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, వైస్ గవర్నర్ హరికిషన్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

విద్యాభివృద్ధితోనే అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. చిన్నమడూరు హైస్కూల్ పదో తరగతి టాపర్ గడ్డం కేజీయాకు మారిసెట్ సంస్థ సహకారంతో రూ.10 వేలు, పెద్దమడూరు హైస్కూల్‌లో టాపర్ వికలాంగురాలు వరికుప్పల హన్సిత్‌కు చంద్రశేఖర్ ఆర్య రూ.5 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డిక్షనరీలు బహూకరించగా స్టడీమెటీరియల్ కోసం లయన్ సుధాకర్‌రెడ్డి రూ.5వేలు అందించారు. ఎంఈఓ జి కళావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలోని గణేష్‌వాడ ప్రాథమికోన్నత పాఠశాలలో కంపోస్టు ఎరువు తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం 18వ రోజు కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు ఎలా చేయాలనే దానిపై వివరించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తదితర వ్యర్థాలను ప్రాసెస్ చేసి కంపోస్ట్ ఎరువు తయారు చేసే విధానాన్ని ప్రత్యక్ష్యంగా చూపించారు. అలాగే తడి, పొడిచెత్తను ఎలా వేరు చేయాలనే దానిపై వివరించారు. మేనేజర్ రాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, పులి శేఖర్, వార్డు ఆఫీసర్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులను అరికట్టాలి

రఘునాథపల్లి: జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జాడ లేకపోవడంతో మెడికల్ షాపుల్లో శాంపిల్‌నకిలీ మందులు విక్రయిస్తున్నారని వెంటనే వాటిని అరికట్టాలని జీఎంపీఎస్ మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు కావటి యాదగిరి డిమాండ్ చేశారు. ఖిలాషాపూర్, మేకలగట్టు, రామర్యానిబంగ్ల గ్రామాల్లో బుధవారం జీఎంపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సహకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలంటూ సమావేశాలు నిర్వహించారు. యాదగిరి, సాంబరాజు, సమ్మయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



కొడకండ్ల: అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

లింగాలఘణపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నేడు అనేక వసతులు కల్పిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ బుధవారం సాంస్కృతిక సారథి కళాకారులు మండల కేంద్రంలో కళాప్రదర్శనలు చేశారు. మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించారు. సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు సంజీవ, టీం సభ్యులు గణేష్, శంకర్, కనకరాజు, స్వప్న, సద్మ, చామంతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

కొడకండ్ల: మండలకేంద్రంతో పాటు ఏడునూతుల మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొడకండ్లలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఒకటో కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. హెచ్ఎంలు ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, వీరస్వామి, ఉమేష్, అంగన్‌వాడీ టీచర్లు మైమూదా, సరిత, ఉప్పలక్ష్మీ, వినోద, నర్సమ్మ, మాధవి, మంజుల, ఉమారాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

జఫర్‌గఢ్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కూనూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఎండీ పర్వేజ్, కాసర్ల సురేందర్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిల్లతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండకు చెందిన బన్నీ కారోనేట్ క్లాత్ స్టోర్ కాశీనాథం రూ.18వేల విలువ చేసే టై, బెల్టులను విద్యార్థులకు అందజేశారు. దాతలు నరహరి, మల్లారెడ్డి, స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ పల్లె రాజిరెడ్డి, కాటం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

దేవరుప్పుల: విద్యతోనే బాలిక సాధికారత సాధ్యమని ఎంఈఓ జి కళావతి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారి సుకన్య అధ్యక్షతన బాలికలకు పుస్తకాలు, యూనిఫామ్, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం

చిల్పూరు: తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడము లక్ష్యమని, అందు కోసం సొంత ఖర్చులతో విద్యార్థులకు సంవత్సరానికి కావాల్సిన స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతోందని హెచ్ఎం చిదురాల కర్ణాకర్ తెలిపారు. కృష్ణాజీగూడెం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం కర్ణాకర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే టెస్ట్, నోట్ బుక్స్ కాకుండా అదనంగా సొంత ఖర్చులతో బుధవారం ఏడాదికి సరిపోను స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల బైపాస్ బ్రిడ్జి సర్వీసు రోడ్డులో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని రఘునాథపల్లి మండలం మాదారానికి చెందిన జోగుల నర్సయ్య (60) దుర్మరణం చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారంలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లి ద్విచక్రవానంపై వెళ్లి తిరిగి వస్తుండగా బైపాస్ సర్వీసు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడగా జనగామ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు ఆ తర్వాత ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రఘునాథపల్లి: మండలంలోని కుసుంబాయితండా శివారు చర్లతండాకు చెందిన గుగులోత్ సురేష్ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 11న పురుగుల మందు తాగి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చర్లతండాకు చెందిన సురేష్ (29) కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేశాడు. అప్పులు ఎందుకు అయ్యాయని భార్య భర్తల మధ్య తగాదా నెలకొంది. దీంతో మనస్తాపం చెందిన సురేష్ ఈ నెల 11న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఇంటి నంబర్లు వేయాలి



మాట్లాడుతున్న రాజు

జనగామ రూరల్: పట్టణంలో మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు అధికారులు ఇంటి నంబర్లు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. కళ్యాణ లింగం , ఉపేందర్, అంజమ్మ, ఎండీ ఫాతిమ, భాగ్య, స్వరూప, కళ, సత్తమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



సీసీ కెమెరాలో చిక్కిన అనుమానితులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గుర్తు తెలియని అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.వేణు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాల పరిధిలో రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని, షాపుల తాళాలు పగులగొట్టడం, వాహనాలు దొంగిలించడం తదితర నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల శివునిపల్లిలోని ఓ వైన్‌షాపు తాళాలు పగులగొట్టి దుండగులు చోరికి యత్నించి విఫలయ్యామరని, వారి ఫొటోలు, వీడియోలు సీసీ కెమెరాలో నమోదు అయ్యాయన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే 8179116586 నంబర్ ద్వారా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.


కళాకారుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న రాంబాబు

రఘునాథపలి: కళాకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. బుధవారం నిడిగొండ రైతు వేదికలో త్రివేణి మహిళా కోలాట కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బోనాల కోలాటం, మహిళలకు కోలాట శిక్షణ ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బొనాసి క్రాంతికుమార్, లింగాజి, లక్ష్మారెడ్డి, అబ్బాష్, బిర్రు లక్ష్మి, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఊర సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి గీతా కార్మికుడు దొమ్మాటి శ్రీనుగౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి గాయపడ్డాడు. కాగా, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం రాజుగౌడ్, తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షులు పట్టాపురి విజయ్‌గౌడ్ ద్వారా విషయం తెలుసుకున్న కొండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాకు చెందిన వారు పంపించిన రూ.10 వేల సాయం బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. నాతి గణేష్, రామచంద్రు, ఎంపెల్లి దర్గయ్య, సాంబరాజు, సమ్మయ్య, స్వామి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

బచ్చన్నపేట: టైలర్ వృత్తినే నమ్ముకుని ఇబ్బందులు పడుతున్న దర్జీల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని టైలర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గాలి తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ టైలర్ వృత్తిలో పని చేస్తూ చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందించండి

పాలకుర్తిటౌన్: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ

సంక్షిప్త సమాచారం

ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓను కలిసి కోరారు.

మోదీ చేస్తున్న అభివృద్ధిని వివరించాలి

రఘునాథపల్లి: పీఎం మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర నాయకుడు కావటి ముత్యాలు అన్నారు. అశ్వరావుపల్లి గ్రామంలో బుధవారం శక్తి కేంద్రం ప్రముఖ్ దైతల రంజిత్ కుమార్ అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించగా మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, ముత్యాలు హాజరై మాట్లాడారు.

రోడ్డుకు మరమ్మతు

నర్మెట: జనగామ–నర్మెట ప్రధాన రహదారిలో మండలకేంద్రానికి సమీపంలో లోకాజ్ వే కంకర తేలి ప్రమాదంగా మారింది. దీంతో గత కొద్ది రోజులుగా పలు ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో పలువురు గాయాల బారిన పడ్డారు. దీంతో స్పందించిన స్థానిక ఎస్సై నైనాల నగేష్ బుధవారం హన్మంతాపురం నివాసి పట్టభద్రుడు చల్లా వెంకటేష్ సహకారంతో బీటీ (తార్) రోడ్డు మరమ్మతు చేపట్టారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

బచ్చన్నపేట: ఇటీవల ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని మండలంలోని ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దూడల కనుకయ్య బుధవారం మేడారంలో సమ్మక్క–సారలమ్మలకు పూజలను నిర్వహించారు.

‘వివరాలు నమోదు చేసుకోవాలి’

స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/నర్మెట/తరిగొప్పుల/రఘునాథపల్లి/లింగాలఘణపురం: వానాకాలం పంటకు గాను రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం కోసం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులందరూ వారి బ్యాంకు అకౌంట్ వివరాలను నమోదు చేసుకోవాలని పలు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు చంద్రన్‌కుమార్, విద్యాకర్‌రెడ్డి, మనోహిత్ విక్రం, మన్నోహిత్ విక్రమరావు, కాకి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు తమ బ్యాంకు అకౌంట్ వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 చివరితేదీయని, రైతులు గమనించి ఏఈఓల వద్ద బ్యాంకు అకౌంట్ వివరాలను నమోదు చేయించుకోవాలని వారు సూచించారు.

నియామకం



మదార్

పాలకుర్తిటౌన్: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలానికి చెందిన ఏదునూరి మదార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య బుధవారం తెలిపారు. రజక వృత్తిదారుల సమస్యలపై గత కొంతకాలంగా పోరాడుతున్న మదార్ కృషిని గుర్తించిన నాయకత్వం కీలక బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

తీరనున్న పేదల సొంతింటి కల



భూమిపూజలో పాల్గొన్న వెంకటాచారి తదితరులు

బచ్చన్నపేట: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల నెరవేరనుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నల్లనాగుల వెంకటాచారి అన్నారు. బుధవారం కట్కూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమం కోసం పనిచేస్తుందన్నారు. నాయకులు పుట్ట నర్సింహులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

జఫర్‌గఢ్: పేదల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ పేర్కొన్నారు. తిమ్మంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆమె ముగ్గుపోసి భూమిపూజ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.